బాలికల ఆరోగ్యానికి భరోసా ఏది?


కోయిల్‌కొండ ఉన్నత పాఠశాల

- ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిన హెల్త్ కిట్ల పంపిణీ
- నాలుగేళ్లుగా విద్యార్థినుల అవస్థలు
- కిట్ల పంపిణీని పునఃప్రారంభించాలని వేడుకోలు



కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల ఆరోగ్యానికి భరోసా కరువైంది. బాలికా ఆరోగ్య సంరక్షణ కోసం 2018–19 విద్యా సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన హెల్త్ కిట్ల పంపిణీ పథకం అటకెక్కింది. ఫలితంగా పేద విద్యార్థినులు ఇబ్బందులపాలవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆరోగ్య సంరక్షణకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసే స్థోమత వారికి ఉండదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థినులకు హెల్త్ కిట్ల పంపిణీకి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శానిటరీ నాప్కిన్స్, సబ్బులు, కొబ్బరినూనె, షాంపూ బాటిల్, టూత్ పేస్ట్, బ్రష్, పౌడర్ తదితర 13 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను ఏడాదికి రెండు సార్లు పంపిణీ చేసేవారు. అయితే 2020 మార్చిలో కరోనా కారణంగా పాఠశాలలు మూతపడ్డాయి. అప్పటి నుంచి నాలుగేళ్లుగా హెల్త్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది.

ఆరోగ్యంపై ప్రభావం..

కోయిల్‌కొండ మండలంలో 8 ఉన్నత, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7నుంచి 12వ తరగతి వరకు 1,090 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఆడుతూ, పాడుతూ బడికి వెళ్లాల్సిన బాలికలు కొందరు ఆరోగ్య సమస్యలతో పాఠశాలలకు దూరమవుతున్నారు. మరికొందరు అనారోగ్యం బారిన పడుతున్నారు. కాగా, స్థానిక కేజీబీవీలో 320 మంది విద్యార్థినులు చదువుకుంటుండగా.. వీరికి ప్రతినెలా కేవలం రూ. 100 చొప్పున హెల్త్ కిట్ల కొనుగోలుకు విద్యాశాఖ చెల్లిస్తోంది. అయితే రూ. 100తో ఏ వస్తువులు రావని.. హెల్త్ కిట్ల పంపిణీని పునఃప్రారంభించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



నాలుగేళ్ల నుంచి ఆరోగ్య కిట్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ కోసం కిట్ల పంపిణీని పునఃప్రారంభించాలి.

– మధుమిత, 8వ తరగతి, కోయిల్‌కొండ

భారంగా ఉంది..



ఆరోగ్య కిట్‌లో ఉండే వస్తువులను బయట కొనుగోలు చేయడం భారంగా మారింది. కరోనా తర్వాత వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని చెబుతున్నారు. కాని ఆరోగ్య కిట్లు మాత్రం ఇవ్వడం లేదు. ఇప్పటి నుంచైనా కిట్లు ఇవ్వాలి.

– నందిని, 9వ తరగతి, కోయిల్‌కొండ

కిట్లు రావడం లేదు..



ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య కిట్ల పంపిణీ కొన్నేళ్ల నుంచి నిలిచిపోయింది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు విన్నవించాం. ఆరోగ్య కిట్ల పంపిణీని పునఃప్రారంభిస్తే.. బాలికల విద్యకు తోడ్పతుంది. కిట్లు రాగానే పంపిణీ చేస్తాం. – వెంకట్‌జీ, ఎంఈఓ, కోయిల్‌కొండ

డబుల్‌బెడ్రూం ఇళ్లలో సమస్యల వెల్లువ


ప్రజావేదికలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్

భూత్పూర్: మున్సిపాలిటీలో సిద్దాయిపల్లి వద్ద నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయని సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో వెల్లడించింది. శుక్రవారం డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు చేపట్టిన తనిఖీలకు సంబంధించిన వివరాలను సామాజిక తనిఖీ అధికారి భద్రునాయక్ వెల్లడించారు. డబుల్‌బెడ్రూం ఇళ్లకు 288 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా.. పేరు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు తప్పుగా నమోదు చేయడంతో 36 మంది లబ్ధిదారులు ఆన్‌లైన్ కాలేదన్నారు. 61 ఇళ్ల తాళాలు వేసి ఉన్నాయన్నారు. లబ్ధిదారులకు సరైన సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. మంచీ నీరు, విద్యుత్ సమస్యలతో పాటు డ్రెయినేజీలు, సీసీరోడ్లు లేకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభించి, పూర్తిచేస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్‌ఐలు వెంకటేష్, బాలసుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ


వాలీబాల్ టోర్నీలో తలపడుతున్న బాలుర జట్లు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్–14 బాలబాలికల వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ముందుగా జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నయ్య పోటీలను ప్రారంభించగా.. బాలుర 16, బాలికల 16 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బాలుర విభాగంలో దేవరకద్ర జట్టు విజేతగా నిలవగా.. బాలానగర్ రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో జడ్చర్ల విజేతగా నిలవగా.. కోయిల్‌కొండ రన్నరప్‌గా నిలిచింది. టోర్నీ అనంతరం జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు.

క్లుప్తంగా

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ధర్నా



మిడ్జిల్: మండల కేంద్రంలో ప్లాట్లను వ్యవసాయ భూమిగా మార్చి, రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 218, 219, 220, 221, 222లో ఉన్న సుమారు 30 ఎకరాల్లో పంచాయతీ లేఅవుట్ ద్వారా ప్లాట్లు చేసి విక్రయించారని.. ప్రస్తుతం ఆ ప్లాట్లను వ్యవసాయ భూమిగా మార్చారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, లాలు, తిరుపతి, రమేష్, రాములు, అంజి, జంగిలయ్య పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ప్రగతినగర్ కాలనీలో శుక్రవారం విశ్వధరణి గ్రూప్ చైర్మన్ సీహెచ్ యాదగిరి ఏర్పాటు చేసిన మారుతి ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను చైర్మన్ సీహెచ్ యాదగిరి దంపతులు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, తోట శ్రీహరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



జడ్చర్ల టౌన్: విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, పేద విద్యార్థుల చదువుకు విద్యావేత్తలు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సత్యనారాయణ, సావిత్రి వేదిక సభ్యులు హేమచంద్రుడు, బాలుయాదవ్, సత్యనారాయణ, శివకుమార్, నరేందర్, గ్రామస్తులు భరత్, వెంకటయ్య, నాగరాజు పాల్గొన్నారు.

108లో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం



భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గర సమీపంలో ఉన్న ఓ పేపర్ కంపెనీలో కూలీగా పని చేస్తున్న గర్భిణి సునీతకు శుక్రవారం పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ ఈఎంటీ బాషా, పైలట్ శివశంకర్ కొత్త మొల్గరకు చేరుకొని సునీతను జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. కుటుంబ సభ్యుల సహాయంతో అంబులెన్స్ సిబ్బంది కాన్పు చేయడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రికి తల్లీబిడ్డను తరలించారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య బృందం ఆయా కేంద్రాలకు వెళ్లి పిల్లల బరువు, ఎత్తును చూశారు. పిల్లలకు సమపాళ్లలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి గ్రామపంచాయతీలో వెలుగుచూసిన రూ.1.73 కోట్ల దుర్వినియోగంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి శివప్రకాశ్ పాత్ర ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం హన్వాడ మండలం అమ్మాపూర్ తండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న శివప్రకాశ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న రంగనాయస్వామి ఆలయాన్ని శుక్రవారం ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ అధికారి చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల తర్వాత రంగనాయకస్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించారు.

ఏఓగా యమారెడ్డి

కోయిల్‌కొండ: మండల వ్యవసాయాధికారిగా యమారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. పంటల సాగులో వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని రైతులకు సూచించారు.

మీసేవ కార్యవర్గంలో చోటు

జడ్చర్ల టౌన్: తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జడ్చర్ల వాసి షేక్‌రఫి ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ మీడియా ప్లస్‌హాల్‌లో నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన షేక్‌రఫికి జిల్లా మీసేవ నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన కొమ్ము చెన్నమ్మ (76) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం వలస కూలీలకు నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేశారు. ఆయన వెంట ఆంజనేయులు, కృష్ణయ్య, అంజయ్య, ఆనంద్, రంగయ్య, నర్సింహులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవాలయాలను కేంద్రంగా చేసుకొని మూలవిరాట్‌లను ధ్వంసం చేస్తున్న ఘటనలను నిరసిస్తూ.. శనివారం జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వంశీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిరసన, ధర్నా కార్యక్రమాలు ఉంటాయని.. ధార్మిక సంస్థలు, కుల సంఘాలు, మహిళా సంఘాలు, వినాయక మండపాల నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

మహమ్మదాబాద్: మండలంలోని జూలపల్లికి చెందిన కుడి నర్సయ్య అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 10న తన చెల్లెలు వెంకటమ్మ ఇంటికి వెళ్తానని వెళ్లి తిరిగి రాలేదని.. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. నర్సయ్య కుమారుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్న బెల్టుషాపులో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. సంపగి శ్రీనివాసులు షాపులో లభించిన మద్యం సీసాలను సీజ్ చేసి.. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

రేపటి నుంచి అగ్నిగుండ మహోత్సవాలు

- పరుశవేదీశ్వరస్వామి ఆలయం ముస్తాబు


పరుశవేదీశ్వరస్వామి ఆలయం

జడ్చర్ల టౌన్: మండలంలోని దుందుభీ వాగు తీరాన ఉన్న మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు అగ్నిగుండ మహోత్సవాలు నిర్వహించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతి ఏటా ఆశ్వయుజ మాసం తదియ తిథి నుంచి రెండు రోజులపాటు అగ్నిగుండ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మొదటి రోజు ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రాతఃకాల పూజలు, 9 గంటలకు రుద్రాభిషేకం, బిల్వార్చనలు, మంగళహారతి, 10గంటలకు రుద్ర హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు అగ్నిగుండ స్థల పూజ, సమిధలు పేర్చుట, 5:30 గంటలకు గణపతిపూజ, స్వామి, అమ్మవార్లకు అభిషేకం, వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి 1:15 గంటలకు వీరభద్రస్వామికి నందికోళ్ల సేవ, సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ మహోత్సవం, 10 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మన్ గోపాల్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్

గండీడ్: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలని డీఈఓ రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఓ వెంట ఎంఈఓ జనార్దన్, బాలుయాదవ్, మాజీ ఎంపీటీసీ బాలయ్య ఉన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న

దేవరకద్ర: ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల పరిధిలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ చేసి, ఉద్యోగ నియామకాలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి.. ఇప్పుడు కమిటీలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ నియామకాల్లో మాదిగ ఉపకులాలను విస్మరించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న తమకు రావాల్సిన వాటా దక్కడం లేదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కూడా రావడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే ప్రతి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ దక్షిణాది జిల్లాల అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, రాష్ట్ర కార్యదర్శి దొబ్బలి ఆంజనేయులు, సభ్యులు జి.శ్రీనివాస్, గెల్వయ్య, ముంచాల యాదగిరి ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి


మిడ్జిల్ కొత్త చెరువులో చేపపిల్లలను వదులుతున్న నాయకులు

రాజాపూర్: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే మాతృమూర్తి, మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రంగారెడ్డి గూడ పెద్ద చెరువులో చేపపిల్లలను వదిలారు. మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, వెంకటేష్, గుణాకర్, కిరణ్, సంజీవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి..

మిడ్జిల్: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్త చెరువులో చేపపిల్లలను వదిలారు. వెంకటయ్య, గౌస్, ఆదాం, బాలయ్య, ఉస్మాన్, శంకర్, జహంగీర్, జహీర్, కృష్ణ, పర్వతాలు, శ్రీను, లాలు పాల్గొన్నారు.

114 చెరువులకు మంజూరు..

నవాబుపేట: మండలంలో 114 చెరువులకు ప్రభుత్వం చేపపిల్లలను మంజూరు చేసిందని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 గ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో చేపపిల్లల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం అన్ని చెరువుల్లో చేపపిల్లలు వదిలే కార్యక్రమం చేపడతామన్నారు.

బోరుమోటార్ కేబుల్ చోరీ

నవాబుపేట: మండలంలోని లోకిరేవు, లింగంపల్లి, రేకుల చౌడాపూర్ గ్రామాల శివారులో వ్యవసాయ బోరుమోటార్ల కేబుల్ చోరీకి గురైంది. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు పొడవునా దాదాపు 25 మంది రైతుల పొలాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు బోరుమోటార్ల కేబుల్‌ను చోరీ చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. విద్యుత్ కేబుల్ చోరీతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువుల కాపరులపై దాడి: కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో పశువుల కాపరులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కందూర్‌కు చెందిన సొంట మణెమ్మ, కాశన్నలు గురువారం తమ పశువులను మేపేందుకు పొలానికి బయలుదేరారు. ఈ క్రమంలో కాటవరం గ్రామానికి చెందిన శంకర్ కందూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తూ.. రోడ్డుపై పశువులు వెళ్తున్న చోట అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో పశువులను మేపేందుకు తీసుకెళ్తున్న మణెమ్మ, కాశన్నలతో శంకర్ గొడవకు దిగాడు. పశువులను రోడ్డుపైకి ఎందుకు తెచ్చారని, ఇద్దరిని కర్రతో కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనదారుడు శంకర్‌పై శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహంపై..

జడ్చర్ల: ఏడాది క్రితం జరిగిన బాల్య వివాహంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బాదేపల్లి నల్లకుంటకు చెందిన బాలిక (16)తో మండలంలోని బండమీదిపల్లికి చెందిన యువకుడికి గతేడాది నవంబర్‌లో వివాహం జరిగింది. అయితే శుక్రవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడితో పాటు ఆరుగురి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలం హద్దు రాళ్ల తొలగింపుపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: తన పొలానికి ఉన్న హద్దు రాళ్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని కొండాపూర్‌కు చెందిన పటేల్ గోపాల్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ దాయాదులు అక్రమంగా పొలంలోకి వచ్చి, హద్దు రాళ్లను తొలగించారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

శిశువు మృతిపై విచారణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతిపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో బాధిత మహిళతో పాటు కుటుంబ సభ్యులు, సిబ్బంది, విధుల్లో ఉన్న డాక్టర్, సూపరింటెండెంట్‌ను వేర్వేరుగా విచారించారు. శిశువు మృతికి గల కారణాలను విశ్లేషించారు. ప్రసవం సమయంలో శిశువు మృతిపై సమగ్ర విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ అనంతరం కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ హిందీ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. సుకన్య మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు నిరంతరం దేశ సేవలో నిమగ్నమై ఉంటారన్నారు. అలాంటి వారు దేశమంతా పర్యటించాల్సి రావడం వల్ల భాష సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. అందుకే 30 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సైన్యం, ఇతర దళాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అవకాశాలు వచ్చినప్పుడు భాష సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధిపతి నర్సింహారావు కళ్యాణి, లెఫ్టినెంట్ డా.రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

దేవరకద్ర: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నిల్వ నీటిని పారబోశారు. గుంతల్లో, హౌసుల్లో దోమల నివారణ మందులు వేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

అడ్డాకుల: మండలంలోని నాగాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాంచంద్రయ్య రాచాల ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం నాగాయపల్లి గ్రామస్తులు, విద్యార్థులు రాంచంద్రయ్యను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి రాములు, ఉపాధ్యాయులు శ్యాం, జాకీర్‌పాషా, దొరబాబు పాల్గొన్నారు.

10 శాతం రిజర్వేషన్ కల్పించాలి

భూత్పూర్: ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ జనజాగృతి సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బి.కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అగ్రకులాల్లో 2 శాతానికి మించి పేదలు లేరని, వారికి 10 శాతం రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆర్థిక వెనుకబడిన అన్ని కులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, నాగన్న, శ్రీనివాస్, నరేందర్, భరత్ కృష్ణ, రవి ఉన్నారు.

బ్యాంకు ఖాతాలో డబ్బు మాయం

జడ్చర్ల: మహిళకు సాయం చేసేందుకు మొబైల్ ఫోన్ ఇచ్చిన వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ. 28వేలు మాయమయ్యాయి. ఈ ఘటన జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మహిళ ఓ వ్యక్తి వద్ద వచ్చి తన కుమారుడు బస్సులో వస్తున్నాడని.. తాను ఆ బస్సు ఎక్కాల్సి ఉందని.. తన కుమారుడికి ఫోన్ చేస్తానంటే తన మొబైల్ ఇచ్చాడు. సదరు మహిళ ఫోన్ మాట్లాడి ఇచ్చిన తర్వాత ఇంటికి వెళ్లి తన బ్యాంకు ఖాతాను సరిచూసుకోగా.. రూ. 28వేలు మాయం అయినట్లు గుర్తించాడు. సహాయం చేయడానికి చొరవ తీసుకున్న పాపానికి తన ఖాతా గుల్ల చేసుకోవాల్సి వచ్చిందని బాధితుడు వాపోయాడు. కాగా, తన పేరును చెప్పడానికి నిరాకరించాడు.